క్లుప్తంగా

నేటి నుంచి గంగజాతర



గంగమ్మ తల్లి మూల విరాట్

దువ్వూరు: దువ్వూరు గ్రామంలో కొలువైన గంగమ్మతల్లి జాతరను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, మాజీ ఎంపీపీ జెర్రి నడిపి ఓబయ్య, ఆలయ ప్రధాన అర్చకులు గిరిధర్ స్వామి తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి గంగజాతర నిర్వహిస్తున్నామన్నారు. ఈ గంగజాతరకు మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు హాజరవుతారని తెలిపారు. 23న శనివారం ఉదయం సిద్ధిభుక్తి యాగం జరిపి పుట్ట బంగారం తెచ్చి పొంగు పాల యాగం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. 24న ఆదివారం పాలేటి యాగం జరిపి గ్రామ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని తెలిపారు.

సింహవాహనంపై శ్రీనివాసుడు



సింహవాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

బద్వేలు అర్బన్: మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

సంక్షేమ సారథి జగనన్న



ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: రాష్ట్రంలో అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదల గుండెల్లో సీఎం జగనన్న సంక్షేమ సారథిగా నిలిచారని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం గానుగపెంట పంచాయతీ రేపల్లె, రేపల్లె హరిజనవాడల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా డాక్టర్ సుధను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో సింగల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, సర్పంచ్ చిన్న వీరభద్రుడు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, కృష్ణయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మహాజన సభ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మహాజన సభ సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎస్.ఈశ్వర్‌రెడ్డి, వై.సాల్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

నిర్లక్ష్యం గడ్డ కట్టేసింది



గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు

పోరుమామిళ్ల : నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలకు పంపిన సిమెంట్ బస్తాలు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. సకాలంలో తరగతి గదుల నిర్మాణాలకు వినియోగించకపో వడంతో ఎందుకూ పనికిరాకుండా గడ్డకట్టేశాయి. కాలువకట్ట ఇందిరానగర్ ఎంపీపీ పాఠశాలలో 50 సిమెంట్ బస్తాలు గడ్డకట్టి పనికిరాకుండా పోయాయి. పాఠశాల అభివృద్ధికి నాడు-నేడు కింద ప్రభుత్వం రూ. 16 లక్షలు మంజూరు చేసింది. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరపోగు రవి, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి పాఠశాల సందర్శించి గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని రవి ఆరోపించారు. పనుల్లో నాణ్యత లోపించిందని విమర్శించారు.

ఆదరణ.. అపూర్వం

- ప్రజలు చిరునవ్వుతో స్వాగతిస్తున్నారు
- ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: ప్రచారంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దంపతులకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 39వ వార్డు కౌన్సిలర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రచారంలో ప్రజలు చిరునవ్వుతో స్వాగతం పలుకుతున్నారని తెలిపారు. తాను 1996 నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నికల్లో పాల్గొంటున్నాని గుర్తుచేశారు. ఎప్పుడూ ఇంతటి ప్రజాదరణ చూడలేదని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న వరదరాజులరెడ్డి రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయించారా.. ప్రొద్దుటూరుకు తాగునీరు ఇచ్చారా.. ఒక్క ఇల్లు అయినా నిర్మించారా.. ఇంటికో ఉద్యోగంలో భాగంగా ఎవరికైనా ఉద్యోగం ఇచ్చారా, ఏ ప్రభుత్వ పాఠశాలనైనా బాగు చేశారా.. నిరుద్యోగ భృతి ఏ మేరకు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో పాటు ప్రొద్దుటూరు నియోజకవర్గానికి 2014–19 మధ్య జరిగిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఆధారాలు చూపిస్తే తాను నామినేషన్ వేయకుండానే పోటీలో నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించి లబ్ధి పొందేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు అరుణ, వంశీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాతకోట కృష్ణవేణి, రమణమ్మ, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు కళావతి, పద్మావతి, పార్వతి, మునిప్రగతి, నిర్మల, సోములవారిపల్లె సర్పంచ్ ప్రశాంతి, ఉపసర్పంచ్‌లు కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, గోసా మనోహర్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశయ్య, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, 34వ వార్డు ఇన్‌చార్జి పోసా భాస్కర్, యాకోబ్, నాగులారపు విజయసారథి, జయసింహా, రమాదేవి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

ఈ నెల 27న జరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సీఎం జగన్ సభ ఏర్పాట్లపై శనివారం సాయంత్రం 4.30 గంటలకు కొర్రపాడు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి తెలిపారు. బస్సు యాత్ర బహిరంగ సభా స్థలిని శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు చేపట్టనున్న మొదటి బహిరంగ సభను ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కడప పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు హాజరవుతారన్నారు. సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసేందుకే సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేయడం వారి నైజం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖాజీపేట: ఎవరి వల్ల లబ్ధి పొందుతారో వారిని విమర్శించడం, నమ్మిన వారిని మోసం చేయడం టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు నాగసానిపల్లె మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు యాదవ్, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, కాటయ్య గారి నాగ సుబ్బారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఖాజీపేటలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని హితువుపలికారు. ఖాజీపేట-3 ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి డీఎల్ రవీంద్రారెడ్డి ద్వారా సహాయం పొంది ఆయనకు మోసం చేశారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీలో చేరి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సహకారంతో ఎంపీటీసీగా గెలిచారని తెలిపారు. ఎమ్మెల్యేను కూడా మోసం చేసి టీడీపీ నాయకుడు సుధాకర్ యాదవ్‌తో కలిసి తిరుగుతున్నారని, అందుకే పార్టీ నుంచి సస్పెండ్ చేశారని తెలిపారు. లక్ష్మిరెడ్డి ఎంపీటీసీ ఎన్నికల్లో అమ్ముడు పోయి.. నేడు నీతులు చెప్పడం సరైంది కాదని అన్నారు. తవ్వారిపల్లె పంచాయితీలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఒక్క ఓటు వచ్చినా తాము రాజకీయ సన్యాసం చేస్తామని వారు సవాల్ విసిరారు. నిజాయితీగా పనిచేస్తున్న రెడ్యం కుటుంబాన్ని విమర్శించడం సరైంది కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బత్తల సుబ్బరాయుడు, ఖాజీపేట వార్డు మెంబర్ నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ ఓసీ రైతు సంఘం అధ్యక్షుడు పాకల శ్రీకాంత్‌రెడ్డి, పాలకొలను ఈశ్వర్‌రెడ్డి, సుబాన్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో నాయకులు

పోరుమామిళ్ల: మండలంలోని చల్లగిరిగెల పంచాయతీ కృష్ణంపల్లెకు చెందిన గాజులపల్లె సీతారామిరెడ్డి, తిరుపతిరెడ్డి, పోలు గురివిరెడ్డి, బండి చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, జయరామిరెడ్డి, రాఘవరెడ్డి (8 కుటుంబాలు) శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పీఆర్అండ్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. మళ్లీ జగనన్న సైం అయితే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, యువ నేత గిరిప్రణీత్‌రెడ్డి, పంచాయతీ నాయకులు కొండా రమణారెడ్డి, నారాయణరెడ్డి, భవనం వెంకటరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, సర్పంచ్ గురయ్య, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుగుణశ్రీ

దువ్వూరు: మండలంలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం దువ్వూరులోని మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మంచినీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాన్నారు. ఆరేళ్లలో నీటి ఎద్దడి రాలేదని, వర్షాభావ పరిస్థితి వల్లే ఈ స్థితి నెలకొందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేతిపంపులు ఉన్న చోట మోటార్లను అమర్చి నీరు అందించాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాల్లో తిరిగి ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలని, అవసరమైతే రైతుల వ్యవసాయ మోటార్ల నుంచి నీటిని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ మాట్లాడుతూ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న హౌసింగ్ బిల్లులను లబ్ధిదారులకు చెల్లించాలని, కొత్తగా ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. మండలంలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పీరుజాత రహమతున్నీసా, మాదం ప్రభావతి, మండల ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులపై కేసు

బద్వేలు అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళికి వ్యతిరేకంగా అనుమతి లేకుండా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన సీపీఐ నాయకులపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన సీపీఐ పార్టీకి చెందిన వీరశేఖర్, బాలఓబులయ్య, వెంకటరమణ, పి.వి.రమణ, ఇమ్మానియేల్, అనిల్, శ్రీనివాసులుతో పాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీలు, ఆందోళనలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సోమాపురంలో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్‌తో పాటు ప్రత్యేక వైద్య బృందం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు అవసరమైన అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

సాయుధ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ప్రొద్దుటూరు క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రొద్దుటూరులో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలతో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ప్రొద్దుటూరుకు సబ్ డివిజన్‌కు సాయుధ బలగాలను కేటాయించారు. డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలైన రామేశ్వరం, కేహెచ్ఎం స్ట్రీట్, ఇస్లాంపురం వీధి, కోనేటి కాల్వవీధి, వినాయకనగర్, ఆర్ట్స్‌కాలేజీ రోడ్డులో కవాతు చేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐలు మంజునాథ్, హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు రాజువారిపేటలో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని రాజువారిపేటలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ కావ్య మాధురి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకూ వైద్య శిబిరం నిర్వహించి గ్రామంలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ఆర్థిక అక్షరాస్యత.. భవితకు భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ రిటైర్డు ఉద్యోగి వెంకటేశ్వర్లు

రాజుపాళెం: ఆర్థిక అక్షరాస్యత భవితకు భరోసా ఇస్తుందని ఎస్‌బీఐ రిటైర్డు ఉద్యోగి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సోమాపురం గ్రామంలో భారతీయ రిజర్వ్‌బ్యాంక్ సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం స్థానికులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బ్యాంక్‌లో ప్రతిఒక్కరూ అకౌంట్ కలిగి ఉండాలని, నగదు రహిత లావాదేవీలు మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం ద్వారా జరుపుకోవాలని సూచించారు. బీమా సౌకర్యం, డిపాజిట్లు, ఎడ్యుకేషన్ లోన్లు, డ్వాక్రా మహిళలకు రుణాల గురించి వివరించారు. హెడ్ సంస్థ ప్రెసిడెంట్ పెరుగు కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు, మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై చైతన్యపరుస్తూ.. డబ్బు ఏవిధంగా పొదుపు, తదితర అంశాలపై వివరించారు. అనంతరం కళాజాత బృందం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు రాఘవేంద్ర, తిరుపతి, ఉదయకుమార్, ఓబన్న పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మైదుకూరు: ఎన్నికల నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని మైదుకూరు అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నియమావళి అమలులోకి వచ్చిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందరిపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు, సామాజిక మాధ్యమాల అడ్మిన్లు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు రెచ్చగొట్టేలా విమర్శలు చేయడం, దీనికి ప్రతి విమర్శలు చేయడం తగదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రూపుల్లో ఎవరు పోస్టు చేసిన వారితో పాటు, గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందచేస్తున్న అశోక్‌కుమార్ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్: చదువుకు పేదరికం అడ్డుకాదని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కేసీ పుల్లయ్య ఫౌండేషన్ అండగా ఉంటోందని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్‌గంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం కేసీ పుల్లయ్య 12వ వర్ధంతి సందర్భంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, కేసీ పుల్లయ్య స్మారక పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ కె.సీ.పుల్లయ్య తనకు సుపరిచితుడని, చదువు ప్రాముఖ్యతను గుర్తించిన ఆయన ఎంతో మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేశారని కొనియాడారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్ మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమానికి కేసీపీ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మరింత మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలకు అందించాలని కోరారు. కేసీ పుల్లయ్య మరణానంతరం కూడా ఆయన ఆశయాలను నెరవేరుస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. కేసీపీ ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకారాదనే ఉద్దేశంతో ప్రతిభగల పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లను ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్, ఎంబీబీఎస్, సీఏ చదువుతున్న 500 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ బి.చంద్రశేఖర్, ఫౌండేషన్ సీఈఓ సుధ, ప్రతినిధులు కృష్ణవేణమ్మ, సునీల్‌కుమార్, వాసుదేవరావు, నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించండి

గోపవరం: రైతులు సాగుచేసిన హైబ్రీడ్ రకానికి చెందిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని మండల రైతాంగం సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నమోదుతో పాటు ఆయా ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయిందని, వెంటనే పంట కొనుగోలు కార్యక్రమాన్ని మొదలుపెట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటా రూ.3,180 ప్రకారం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని సంబంధిత అధికారులు తెలియజేశారన్నారు. పంట కొనుగోలు కోసం ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచామని, తొలకరి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు ప్రారంభించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

భక్తుల కొంగుబంగారం మున్నెల్లి అంకాలమ్మ



అంకాలమ్మ మూలవిరాట్

బి.కోడూరు: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా మండలంలోని మున్నెల్లిలో వెలసిన అంకాలమ్మ విరాజిల్లుతుంది. అంకాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలను ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 23న ఆకుపూజతో అమ్మవారిని అలంకరించడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 24వ తేదీన ధ్వజారోహణం, 25న కలశస్థాపననిర్వహించనున్నారు. 26న బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

అంకాలమ్మ బ్రహ్మోత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. వారికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

వైవీయూ క్యాంపస్ సుందరీకరణ

వైవీయూ : యోగి వేమన యూనివర్సిటీ క్యాంపస్‌ను సుందరీకరించేందుకు ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, 6, 9 విద్యార్థులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకట్రామిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వివిధ ఆకృతులలో ఉన్న చెట్లపై వన్య ప్రాణుల చిత్రాలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, మృత్యుంజయరావు, అధ్యాపకులు బి.ఈరప్ప, చినరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్– 4 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లిలో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం మైనారిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రియాజున్నీసా నీటి ప్రాముఖ్యత, సంరక్షణ గురించి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వివరించారు. ప్రపంచ జల దినోత్సవంపై ఉప ఉపన్యసించారు.

ఘనంగా దేవసాని గోవిందరెడ్డి వర్ధంతి



గోవిందరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన: ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డి తండ్రి దేవసాని గోవిందరెడ్డి నాలుగో వర్ధంతిని మండలంలోని వరికుంట్ల గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు గోవిందరెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధతో పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌతమి ఇంజినీరింగ్ కాలేజి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్: గౌతమి మహిళా ఇంజినీరింగ్ కాలేజి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కళాశాల వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఎల్‌యూఐ స్టేట్ కో కన్వీనర్ వి.హరిత మాట్లాడుతూ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి నవ్య ఉరి వేసుకుని ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. విద్యార్థి మృతి విచారణ చేసి బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రేమ్ కుమార్, పీటర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన అవసరం

ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

ప్రొద్దుటూరు: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు డి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త బాలల చట్టాలపై, మహిళల, పిల్లల రక్షణకు సంబంధించిన హెల్ప్ లైన్ నంబర్లపై అందరికి అవగాహ కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆడపిల్లల జననాన్ని స్వాగతిస్తూ ఆడపిల్లలను గౌరవించేలా ప్రోత్సహించాలని తెలిపారు. రక్తహీనత ఉన్న లబ్ధిదారుల పూర్తి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్త వద్ద ఉండాలన్నారు. కిశోర బాలికలకు, లబ్ధిదారులకు అందించే పోషకాహార సరుకులు ఫేషియల్ యాప్ ద్వారా మాత్రమే పంపిణీ చేయాలని సూచించారు. యాప్‌లో ప్రీ స్కూల్ హాజరు నమోదు చేయాలన్నారు. పిల్లలకు ఆధార్ కార్డులు తీసుకోవాలని, ఐరన్ సిరప్ పంపిణీ లబ్ధిదారులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేష్, సూపర్‌వైజర్లు ఈశ్వరి, కళావతి, విజయేశ్వరి, రఫి భాను, బీపీసీ శ్రీనివాసులు, పావని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బేటి బచావో.. బేటి పడావోపై అవగాహన

మేదర వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బేటి బచావో.. బేటి పడావోపై ఐసీడీఎస్ ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి జి.సునీత మాట్లాడుతూ బాలికలను సంరక్షించి వారికి ఉన్నత చదువులు చెప్పించాలని సూచించారు. మగ, ఆడ వివక్ష తగదని, ఇద్దరు సమానమని తెలిపారు. చిన్న వయసులో బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడ పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెడు స్పర్శ, మంచి స్పర్శల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లక్షుమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.